అందుకు కూడా అతను వప్పుకోలేదు. వంచనతోనైనా సరే ఆ గుర్రాన్ని చేజిక్కించుకోవాలని అతను ఒక పథకం ఆలోచించాడు.

గుర్రం యజమాని దైవ భక్తుడు, దాత, బీదలంటే దయ గలవాడు. అతను వెళ్ళే దారిలో ఇతను భిక్షగాడి వేషం వేసుకుని కూర్చున్నాడు. గుర్రం మీద అతను వచ్చేప్పుడు మూలగడం ప్రారంభించాడు. మోసపు భిక్షగాడి దీన స్థితికి జాలిపడి, తన గుర్రం ఎక్కమని, వైద్యుడి దగ్గరకి తీసుకెళ్తానని చెప్పాడు గుర్రం యజమాని.

"చాలా రోజులుగా తిండి లేదు. గుర్రం మీద కూర్చునే ఓపిక లేదు." చెప్పాడు భిక్షగాడి వేషంలోని మోసగాడు.

దాంతో గుర్రం యజమాని భిక్షగాడిని గుర్రం మీదకి ఎత్తి కూర్చో పెట్టి, తను గుర్రంతో పాటుగా నడవసాగాడు. కొద్ది దూరం వెళ్ళగానే భిక్షగాడి వేషంలోని మోసగాడు దాన్ని దౌడు తీయించాడు.

మోసం తెలుసుకున్న గుర్రం యజమాని గట్టిగా అరిచి చెప్పాడు.

"నువ్వు గుర్రాన్ని దొంగిలించిన విషయం మాత్రం ఎవరికీ చెప్పకు."

"ఏం? నువ్వు మోసపోయిన సంగతి ఎవరికీ తెలియకూడదనా?" ప్రశ్నించాడు మోసగాడు వేళాకోళంగా.

"కాదు. ఇది విన్నవారు నిజమైన భిక్షగాడు ఎవరైనా ఏదైనా జబ్బుతో దారిపక్కన పడివుంటే, మోసగాడేమోనని అతనికి సహాయం చేయరన్న భయంతో." చెప్పాడు గుర్రం యజమాని.

ఆ మాటలకి ఆ మోసగాడికి కనువిప్పు కలిగింది. ఆ గుర్రాన్ని దాని యజమానికి అందచేసి క్షమాపణలు కోరాడు.

## 10. ప్రార్థన

అది 1912వ సంవత్సరం. బ్రిటన్‌లోని బోల్టన్ అనే ఊళ్ళోని చర్చ్‌లో ఓ పాటర్, అతని భార్య చాలా కాలంగా పని చేస్తున్నారు. వృద్ధాప్యం వల్ల

వాళ్ళు రిటైర్ కావాలనుకున్నారు. ఆ ఊళ్ళోని కొందరు పెద్దలంతా కలిసి తలో కాస్తా వేసుకుని వాళ్ళకి ఇష్టమైనదేదైనా కొనివ్వాలనుకున్నారు.

"మీకేం కావాలో మొహమాట పడకుండా అడగండి. మోటారు కారా? స్విట్జర్లాండ్‌లో వెకేషనా? మీ ఇష్టం." అడిగారు.

ఆ రోజు ఉదయమే దినపత్రికలో ఆ దంపతులు, మర్నాడు లండన్ నించి అమెరికాకి వెళ్ళే ఓ గొప్ప ఓడ గురించి చదివారు. అమెరికా వెళ్ళాలన్న కోరిక ప్రగాఢంగా ఉన్న ఆ దంపతులు, అందులో వెళ్ళి రావాలని ఉన్నట్లు చెప్పారు. కమిటీ పెద్దలు ఇంటింటికీ ఓ చిన్నపెట్టెని తీసుకెళ్ళారు.

అందరూ తలాకాస్త డబ్బు ఆ చిన్నపెట్టెలో వేసారు. కమిటీ పెద్దలు డబ్బు మొత్తం లెక్క పెట్టారు. ఐతే, ఆ ఓడలో అమెరికాకి వెళ్ళిరావడానికి ఆ దంపతులిద్దరికీ టిక్కెట్లకి డబ్బు తక్కువైనట్లు వాళ్ళు గ్రహించారు. వారు మిగిలిన డబ్బుని సమీకరించ లేకపోయారు. దాంతో వాళ్ళు జరిగింది పాస్టర్ దంపతులకి వివరించి, తమ అశక్తతని బాధగా తెలియచేసారు.

"చూసారా? మన జీవితాలని పూర్తిగా లార్డ్‌కే అంకితంచేసి సేవ చేసాం కదా! ఐనా మన ఈ చిన్న ప్రార్థనని ఆలకించి ఈ ఒకే ఒక్క కోరికని దేవుడు మన్నించనే లేదు." చెప్పింది పాస్టర్ భార్య భర్తతో.

పాస్టర్ ఏం మాట్లాడలేదు. రెండు రోజులు గడిచాయి. మూడో రోజు ఉదయం పాస్టర్ హడావిడిగా వచ్చి చెప్పాడు.

"డార్లింగ్. నువ్వు చెప్పింది తప్పు. దేవుడు మన ప్రార్థనని ఆలకించాడు." ఆరోజు దిన పత్రికని ఆమెకి అందించాడు.

అందులోని ప్రధాన వార్త చదివిందామె.

'లండన్‌నించి అమెరికా బయలుదేరిన, ఓడ సముద్రంలో మునిగిపోయి, వందలమంది మరణించారు.' అన్నదా వార్త.

"నిజమే. దేవుడు మన ప్రార్థన విన్నాడు." చెప్పిందామె ఉద్వేగంగా.

కథా నిలయం
6039
శ్రీకాకుళం

వెంటనే ఆ ఇద్దరూ కృతజ్ఞత నిండిన హృదయాలతో, కళ్ళ నీళ్ళతో మోకాళ్ళ మీద కూర్చుని దేవుణ్ని ప్రార్థించారు.

ఆ ఓడ పేరు టైటానిక్!

## 11. కమింగ్ టు హైద్రాబాద్

హైద్రాబాద్‌లో ఉద్యోగం సంపాదించాలనుకుని పంతొమ్మిదేళ్ళ రంగనాథ్ పొన్నూరు నుండి రైల్లో బయలుదేరాడు. హైద్రాబాద్‌లో పరిచయస్థులెవరూ లేకపోవడంతో అతనికి మనసులో భయంగా వుంది.

రైలు వరంగల్ స్టేషన్‌కి వచ్చాక భోజనం చేద్దామని జేబులో చెయ్యి పెడితే పర్సు లేదు. దాన్ని ఎవరో కొట్టేసారని, తన దగ్గరి డబ్బంతా పోయిందని గ్రహించాడు రంగనాథ్. ఆ సంగతి అందరికీ తెలిసింది.

"ఎక్కడికి?" అతని ఎదురుగా కూర్చున్నాయన ప్రశ్నించాడు.

"హైద్రాబాద్‌కి. ఉద్యోగం కోసం."

"నా మనవడు వల్లభరావు హైద్రాబాద్‌లోనే 'మోడ్రన్ డ్రస్ ఫేక్టరీ'లో పని చేస్తున్నాడు. వాణ్ని కలిసి నా పేరు చెప్పు. నీకు సహాయం చేస్తాడు."

రంగనాథ్ ఆ వివరాలు రాసుకున్నాడు. ఖాజీపేటలో దిగబోతూ ఆయన చెప్పాడు.

"భయపడక. అన్నిటికీ దేవుడే వున్నాడు. ఆయన్ని నమ్ముకో చాలు."

రంగనాథ్ రైలు దిగి మోడ్రన్ డ్రస్ ఫేక్టరీ గురించి ఎంతమందిని అడిగినా ఎవరూ అదెక్కడుందో చెప్పలేకపోయారు. చివరికి అలసిపోయిన రంగనాథ్, తాళం వేసి వున్న ఓ గది ముందు నడుం వాల్చాడు.

వెంటనే నిద్ర పట్టేసింది.

చీకటి పడుతుండగా ఎవరో అతన్ని కుదుపుతూ లేపారు. అతను అరుస్తుండటంతో రంగనాథ్‌కి మెలకువ వచ్చింది.

"ఏ ఊరు మనది? ఇక్కడ పడుకున్నావేమిటి? ఎవరూ లేరా నీకు?"